నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | మంగళవారం 23 జనవరి 2024 | MAHABUBABAD


నర్మెటలో శ్రీరాముడి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


ఏటూరునాగారంలో ర్యాలీగా వస్తున్న భక్తులు

# జై శ్రీరాం..

## రామ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

**పలుచోట్ల బాలరాముడి ప్రాణప్రతిష్ఠ లైవ్**

**అపురూప ఘట్టాన్ని కనులారా వీక్షించి తరించిన భక్తజనం**

**ఊరూరా ఉత్సవ విగ్రహాలు, చిత్రపటాలతో శోభాయాత్ర**

**భక్తిపారవశ్యంలో మునిగితేలిన జనం**





జైశ్రీరాం.. జైశ్రీరాం నామస్మరణతో ఊరూవాడ మార్మోగింది. సోమవారం రామజన్మభూమి అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరుగగా ఈ అపురూప ఘట్టాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా కనులారా వీక్షించి భక్తజనం తరించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలు ఆలయాలు, పట్టణాల్లోని కూడళ్లలో అయోధ్య రాముని ప్రాణప్రతిష్ఠ వేడుకను తిలకించేందుకు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. అనంతరం భక్తుల కోసం మహాన్నదానం నిర్వహించారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌తో పాటు విశ్వహిందూ పరిషత్, పలు మిత్ర మండళ్లు, అసోసియేషన్ల ఆధ్వర్యంలో శ్రీరాముడి ఉత్సవ విగ్రహాలు, చిత్రపటాలతో గ్రామాలు, పట్టణాల్లో కన్నులపండువగా శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులు పట్టగా చిన్నాపెద్దా కోలాటాలు వేస్తూ రామనామ సంకీర్తనలు చేసుకుంటూ ముందుకుసాగారు. ఇలా ఊరూవాడన ఎక్కడచూసినా పండుగ వాతావరణం కనిపించగా ప్రజలంతా భక్తిపారవశ్యంలో మునిగితేలారు.

– నమస్తే నెట్‌వర్క్, జనవరి 22


వల్మిడి రామాలయంలో పూజలు చేస్తున్న ఎర్రబెల్లి


దామెర : జైశ్రీరాం ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన


కాశీబుగ్గలోని శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయంలో శ్రీరామజపం చేస్తున్న భక్తులు


శాయంపేట మత్స్యగిరి స్వామి గుడిలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠను లైవ్‌లో చూస్తున్న జనం


గార్ల మండల కేంద్రంలో శోభాయాత్రలో భక్తులు


ఏటూరునాగారంలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠను వీక్షిస్తున్న భక్తులు

# అధికారులు అంకితభావంతో పనిచేయాలి

**పనితీరు సరిగా లేని వారిపై కఠిన చర్యలు : గ్రీవెన్స్‌లో మంత్రి కొండా సురేఖ**

ఖిలా వరంగల్, జనవరి 22 : ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు అంకితభావంతో పని చేయాలని, పనితీరు సరిగా లేని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్‌కు మంత్రి మొదటిసారి రావడంతో కలెక్టర్, అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం గ్రీవెన్స్‌లో మంత్రి అధికారులతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులతో పాటు హైదరాబాద్ ప్రజా భవన్‌లో వరంగల్ జిల్లాకు సంబంధించిన రెండు విడుతల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ప్రజాపాలన దరఖాస్తులపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ఒకే సమస్యపై దరఖాస్తుదారులు పలుమార్లు గ్రీవెన్స్‌కు రాకుండా పరిష్కారం చూపాలన్నారు. అలాగే దరఖాస్తు స్టేటస్‌ను ఎప్పటికప్పుడు లబ్ధిదారుడికి తెలిసేలా త్వరలో చర్యలు చేపడుతామన్నారు. ఫ్రెండ్లీ గవర్నమెంట్‌లో అధికారులు తీరు మార్చుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడారు. జిల్లాలో 55 వినతులు స్వీకరించామన్నారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డీఆర్డీవో పీడీ సంపత్‌రావు పాల్గొన్నారు.


వరంగల్ కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న మంత్రి కొండా సురేఖ

# అప్పులబాధతో రైతు ఆత్మహత్య

నెల్లికుదురు, జనవరి 22: అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నెల్లికుదురు మండలంలో జరిగింది. ఎస్సై క్రాంతి కిరణ్ కథనం ప్రకారం.. మదనతుర్తి గ్రామానికి చెందిన వడకపురం చంద్రయ్య(56)కు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. దానికి నీటి వసతి లేకపోవడంతో మూడేళ్ల క్రితం అప్పు తెచ్చి ఐదు చోట్ల బోర్లు వేయించాడు. ఒక్క బోర్‌లో కూడా నీళ్లు రాలేదు. వేసిన పంటకు దిగుబడి రాలేదు. ప్రస్తుతం 2 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేయగా, తెగులు సోకి తీవ్రంగా నష్టపోయాడు. పంట దిగుబడి లేక బోర్లు వేయడానికి తెచ్చిన అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది ఈ నెల 19న వ్యవసాయ చేను వద్ద పురుగుల మందు తాగాడు. ఇంటికి వచ్చి వాంతులు చేసుకుంటుండగా కుటుంబసభ్యులు గమనించి వెంటనే మహబూబాబాద్‌లోని ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 21 రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ

# టీజీవోస్ క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి సురేఖ

హనుమకొండ, జనవరి 22 : తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లాల యూనిట్ల నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి కొండా సురేఖ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా గెజిటెడ్ అధికారులు ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా అందజేయాలని, జిల్లా అభివృద్ధి దిశలో పయనించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎన్నమనేని జగన్ మోహన్‌రావు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, కార్యదర్శి ఫణికుమార్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శులు కిరణ్‌కుమార్‌గౌడ్, రాజేశ్ కుమార్, జిల్లా నాయకులు సురేశ్‌కుమార్, మాధవరెడ్డి, వెంకటేశ్వర్లు, ఆస్నాల శ్రీనివాస్, రాజేశ్‌కుమార్, సుధీర్‌కుమార్, రామచందర్‌రావు, మైదం రాజు పాల్గొన్నారు.


కొమురవెల్లిలో పెద్దపట్నం, అగ్నిగుండం

# భక్తజనం.. బండారిమయం

**భక్తిశ్రద్ధలతో పెద్ద పట్నం**

**ఉత్కంఠభరితంగా అగ్నిగుండాలు**

**కోరమీసాల స్వామికి మొక్కులు**

**చెల్లించుకున్న భక్తులు**



చేర్యాల, జనవరి 22 : పట్నం వారం సందర్భంగా కొమురవెల్లి మల్లన్న క్షేత్రం పసుపువర్ణ శోభితమైంది. భక్తులు చల్లుకున్న పసుపుతో స్వామివారి సన్నిధి పసుపుమయమైంది. పంచవర్ణాల పెద్ద పట్నాన్ని దాటుకుంటూ అగ్నిగుండ ప్రవేశం చేస్తూ మేడలమ్మ, కేతమ్మ సమేత మల్లికార్జునుడిని దర్శించుకొని భక్తులు తన్మయత్వం పొందారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవస్థానం వద్ద పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి పెద్దపట్నం, అగ్నిగుండం వరకు తీసుకొచ్చి పూజలు నిర్వహించగా అర్చకులు దాటిన వెంటనే భక్తులు దాటారు. అంతకుముందు భక్తులు పసుపును ఒళ్లంతా పూసుకోవడంతో పాటు ఒకరిపై ఒకరు చల్లుకున్నారు.


కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో అగ్నిగుండం, పెద్దపట్నం తొక్కేందుకు వచ్చిన హైదరాబాద్ శివసత్తులు, జోగినులు, భక్తులు

# గడువులోగా పూర్తయ్యేనా?

**రేషన్ షాపుల్లో కొనసాగుతున్న ఈ-కేవైసీ ప్రక్రియ**

**ఈ నెల 31తో ముగియనున్న గడువు**

**ప్రథమ స్థానంలో హనుమకొండ**

**చివరి స్థానంలో మహబూబాబాద్**

మహబూబాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): రేషన్ షాపుల్లో ఈ-కేవైసీ(ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) ప్రక్రియ గడువులోగా పూర్తయేలా కనిపించడం లేదు. ఇంకా చాలా జిల్లాల్లో కొనసాగుతూనే ఉన్నది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆహారభద్రత కార్డులకు ఈ-కేవైసీ ప్రక్రియను అధికారులు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అమలు చేస్తున్నారు. హనుమకొండ జిల్లా ఈ-కేవైసీ ప్రక్రియలో ముందుండగా, మహబూబాబాద్ జిల్లా చివరి స్థానంలో ఉంది. ఈ ప్రక్రియ తుది గడువు ఈ నెల 31తో ముగియనుండడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. గడువు పెంచాలని కోరుతున్నారు. రెండు జిల్లాల్లో 75 శాతం పూర్తి కాగా, మిగిలిన నాలుగు జిల్లాల్లో 60శాతానికే పరిమితమైంది. ఈ నెల 31వరకు వంద శాతం పూర్తవడం గగనంగా మారింది. మరో నెల రోజుల పాటు పొడిగించినా వంద శాతం ఈ ప్రక్రియ పూర్తికాదని అధికారులు చెబుతున్నారు. ఈ- కేవైసీ పేరుతో కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొదటి స్థానంలో హనుమకొండ, రెండో స్థానంలో వరంగల్ జిల్లా, మూడో స్థానంలో జయశంకర్ భూపాలపల్లి, నాలుగో స్థానంలో జనగామ, ములుగు ఐదో స్థానం, మహబూబాబాద్ జిల్లా చివరి స్థానంలో ఉంది. రేషన్ కార్డులో ఉన్న ప్రతి సభ్యుడి వేలిముద్రను రేషన్‌డీలర్లు మిషన్ల ద్వారా తీసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 75శాతం కూడా పూర్తి కాలేదని, ఈ నెలాఖరుకు పూర్తి కావడం కష్టమేనని అధికారులు, డీలర్లు చెబుతున్నారు. ఈ-కేవైసీ ప్రక్రియను ముందుగా 2023 డిసెంబర్ 31తేదీ లోపు పూర్తి చేయాలని భావించినా పూర్తి కాలేదు. మళ్లీ ఈనెల 31వరకు గడువును పొడిగించారు. ఈ నెల 31వరకు పూర్తయ్యే పరిస్థితి కనిపించకపోవడంతో ఈ-కేవైసీ గడువును మరింత పెంచే అవకాశం లేకపోలేదు. కేంద్ర ప్రభుత్వం ఒకవైపు రేషన్ షాపుల్లో, మరోవైపు గ్యాస్ ఏజెన్సీల్లో ఈ-కేవైసీ అమలు చేస్తూ ప్రజలను పరేషాన్ చేస్తున్నది.



**ఉమ్మడి జిల్లాల వారీగా వివరాలు**

| జిల్లాపేరు | కార్డులు | సభ్యులు | ఈ-కేవైసీ చేసినవి | చేయాల్సినవి | పూర్తయిన శాతం |
|---|---|---|---|---|---|
| హనుమకొండ | 2,28,147 | 6,75,550 | 5,04,698 | 1,70,852 | 74.71 |
| వరంగల్ | 2,66,679 | 7,87,991 | 5,76,910 | 2,11,081 | 73.21 |
| భూపాలపల్లి | 1,23,560 | 3,45,795 | 2,49,787 | 96,008 | 72.24 |
| జనగామ | 1,61,148 | 4,85,906 | 3,39,873 | 1,46,033 | 69.95 |
| ములుగు | 91,509 | 2,53,985 | 1,63,602 | 90,383 | 64.41 |
| మహబూబాబాద్ | 2,40,373 | 7,05,920 | 4,29,477 | 2,76,443 | 60.84 |
| మొత్తం | 11,11,416 | 32,55,147 | 22,64,347 | 9,90,800 | 69.22 |

# ఢిల్లీలో గణతంత్ర వేడుకలకు జంగాలపల్లి సర్పంచ్ దంపతులు

ములుగు, జనవరి 22(నమస్తే తెలంగాణ) : ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు స్వచ్ఛ గ్రీహీస్ విభాగంలో ములుగు మండలం జంగాలపల్లి సర్పంచ్ మస్రగాని అనిత-వినయ్‌కుమార్ దంపతులకు ఆహ్వానం అందింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ స్వచ్ఛ భారత్ మిషన్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు డైరెక్టర్ ఎం హన్మంతరావు సోమవారం సాయంత్రం ఉత్తర్వులు వెలువరించారు. ఈ నెల 24న ఢిల్లీకి, 29న హైదరాబాద్‌కు వచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.


అనిత-వినయ్‌కుమార్ దంపతులు